క్లుప్తంగా

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాత ప్రతినిధికి బాండ్ అందజేస్తున్న ఏఈవో నరసింహరాజు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శుక్రవారం నగరంలోని టీఎస్ఎన్ కాలనీకి చెందిన కవికొండల సీతారామస్వామి రూ.లక్ష విరాళం ఇచ్చారు. దాత ప్రతినిధి కాశీవిశ్వనాథం సంబంధిత నగదు అధికారులకు అందజేశారు. దేవస్థానం తరపున నిత్యాన్నదాన విభాగం ఏఈవో నరసింహరాజు బాండ్ అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం సూపరింటిండెంట్ పాలూరి నరసింగరావు, ప్రముఖ న్యాయవాది రాంజీ పాల్గొన్నారు.

అప్పన్న నిత్యరూప చిత్రం అందజేత



ఫొటో అర్చకులకు అందజేస్తున్న దినేష్‌రాజ్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యరూప చిత్రాన్ని శుక్రవారం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు వారణాసి

దినేష్‌రాజ్ వైదిక వర్గాలకు అందజేశారు. రాజమహేంద్రవరానికి చెందిన ప్రఖ్యాత చిత్రకారుడు హరి తాడోజు సింహాచలంలోని స్వామివారి నిత్య రూపాన్ని చిత్రీకరించినట్టు దినేష్‌రాజ్ తెలిపారు. కార్యక్రమంలో స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధాన అర్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు పాల్గొన్నారు.

పరదేశమ్మ పండగ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గ్రామకమిటీ సభ్యులు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధి కణితి కాలనీలో వెలసిన పరదేశమ్మ వారి పండగ మహోత్సవాల కరపత్రాలను గ్రామకమిటీ సభ్యులు శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. పండగ వివరాలను తెలియజేశారు. 8న తొలిరోజు ఉజిడి బండి తోలుట, 10వ తేదీన రాత్రి 7 గంటలకు అమ్మవారి పుట్టుక తెచ్చుట, 11వ తేదీన మంగళవారం సాయంత్రం 6 గంటలకు అమ్మవారి ఘటాల ఊరేగింపు కార్యక్రమం, అదే విధంగా 17వ తేదీన సోమవారం రాత్రి 8 గంటలకు అమ్మవారి తొలేళ్ల పండగ ఘనంగా నిర్వహించనున్నామన్నారు. 18వ తేదీ ఆఖరి రోజున అమ్మవారి పండగ మహోత్సవం సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. భారీ బాణసంచా నడుమ అమ్మవారి పండగ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కణితి గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ వేతనాలకు వినతి



అమృతరావు విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ నిర్వాసిత కాంట్రాక్టు కార్మికులను పనిలోకి తీసుకోవడంతో పాటు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించేలా చూడాలని ఉక్కు శ్రామిక సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ఉక్కు హిల్ టాప్ కూడలి వద్ద స్మృత్యంజలి పార్కులోని ఉక్కు ఉద్యమ నేత అమృతరావు విగ్రహానికి నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. మూడు నెలలుగా వేతనాలు లేకపోవడంతో పాటు గత నెలాఖరు నుంచి విధులకు ఆపివేయడంతో కాంట్రాక్టు కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారిని వెంటనే పనుల్లోకి తీసుకుని, కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు, కరణం సత్యారావు, బొడ్డు రమణ, కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తు ప్రజల నినాదం

జగనన్నే మా భవిష్యత్తు...మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం పెందుర్తి నియోజకవర్గంలో శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఆయా ప్రాంతాల్లోని ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన పాలన, చేసిన సంక్షేమాన్ని వివరించారు. ఇంకా సమస్యలేమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో కూడా జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉంటేనే రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెంది సంక్షేమ ఫలాలు అందుతాయని వివరించారు.



మా నమ్మకం నువ్వే జగన్ లోగో ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సూర్యకుమారి,జెడ్పీ వైస్ చైర్మెన్ తుంపాల

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- ప్రజలకు సంక్షేమ పథకాలు వివరించిన నాయకులు

సింహాచలం: 'జగనన్నే మా భవిష్యత్తు...మా నమ్మకం నువ్వే జగన్' అనే కార్యక్రమం ప్రజల నుంచి వచ్చిన నినాదమని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ అన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా ప్రయోజనం పొందిన వారు మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వెళ్తున్నామని చెప్పారు. జగనన్నే మా భవిష్యత్తు-మానమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని శుక్రవారం 94వ వార్డు వేపగుంట జంక్షన్‌లోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలవేసి ప్రారంభించారు. అనంతరం వార్డు పరిధిలోని కన్వీనర్లు, గృహసారథులతో కలిసి పలు కుటుంబాలను కలిశారు. నాటి టీడీపీ పాలనకు, నేటి జగనన్న పాలనకు మధ్య తేడాను వివరించారు. వచ్చే ఎన్నికల్లో తమను ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో చంద్రబాబు 600 పైగా హామీలు ఇచ్చి, ముఖ్యమంత్రి అయ్యాక ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. డ్వాక్రా, రైతు రుణమాఫీ చేస్తానని, నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి మోసం చేశారన్నారు. ఎస్సీలను చాలా చులకనగా చంద్రబాబు చూశారన్నారు.

98 శాతం హామీలు అమలు

2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి కాగానే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేరుస్తున్నారన్నారు. ఇప్పటికే 98 శాతం హామీలు నెరవేర్చారన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు తీసుకొచ్చి అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇళ్లకే సంక్షేమ పథకాలు అందించి చరిత్ర సృష్టించారని కొనియాడారు. పార్టీలు, కులాలు, ప్రాంతాలు, రాజకీయాలకతీతంగా సంక్షేమం అందిస్తున్నారన్నారు. ప్రతీ ఒక్కరూ సంక్షేమం చేకూరిందని తమను ఆశీర్వదించారన్నారు. ఆ స్ఫూర్తితోనే జగనన్నే మా భవిష్యత్...మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ద్వారా ప్రతీ ఇంటికీ సచివాలయ గృహ సారథులు, కన్వీనర్లు వెళ్లి కలుస్తారన్నారు. కార్యక్రమంలో 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, మండల పార్టీ అధ్యక్షుడు నక్క కనకరాజు, ఎంపీపీ నాగమణి, పీఏసీఎస్ చైర్మన్ గొర్లె రామునాయుడు, 94వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఆదిరెడ్డి మురళి, పార్టీ నాయకులు చిన్ని, దాసరి సత్తిబాబు, ఎర్ర వరహానరసింహం, బల్ల రాంబాబు, పాల్గొన్నారు.



మహానేత రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్ , నాయకులు

- 93వ వార్డు గణేష్‌కాలనీ, భరత్‌నగర్‌లో వైఎస్సార్‌సీపీ నాయకుడు దాసరి సత్తిబాబు ఇంటింటికీ వెళ్లి జగనన్నే మా భవిష్యత్తు...మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.
- 95వ వార్డులోని చీమలాపల్లిలో కార్పొరేటర్ ముమ్మన దేముడు జగనన్నే మా భవిష్యత్తు..మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజాభిప్రాయాన్ని సేకరించారు.
- పెందుర్తి మండలం రాంపురంలోని 295 సచివాలయం పరిధిలో జగనన్నే మా భవిష్యత్తు...మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కన్వీనర్లు అన్నరెడ్డి శ్రీరాములు, అన్నంరెడ్డి శిరీష తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా

సబ్బవరం: మండలంలో జగనన్నే మా భవిష్యత్తు-మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని శుక్రవారం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆదేశాల మేరకు గుల్లేపల్లిలో ఎంపీపీ బోకం సూర్యకమారి, జెడ్పీ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాక ముందు, వచ్చిన తర్వాత ఉన్న పరిస్థితులను వివరించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వెంటే ఉండి తమ మద్దతు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కొటాన రాము, మండల జేసీఎస్ ఇన్‌చార్జి సబ్బవరపు ముత్యాలనాయుడు, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, సర్పంచ్ బండారు మంగ, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు,బండారు శ్రీను,యడ్ల నాయుడు పాల్గొన్నారు.

- అంతకాపల్లి సచివాలయం పరిధిలో జగనన్నే మా భవిష్యత్తు-మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి మిగిలిన నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు,వచ్చిన తర్వాత పరిస్థితులను వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, మాజీ సర్పంచ్ సబ్బవరపు దేముడుబాబు,ఉప సర్పంచ్ గొర్లి అప్పారావు, సచివాలయ కన్వీనర్ గొర్లి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



గొర్రెవానిపాలెంలో..



వాడచీపురుపల్లిలో పాల్గొన్న వైస్ ఎంపీపీ



అంతకాపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ నారాయణమూర్తి తదితరులు



నాయుడుపాలెంలో ప్రజా మద్దతు పుస్తకాన్ని ప్రదర్శిస్తున్న పార్టీ నాయకులు

పరవాడ మండలంలో అట్టహాసంగా..

పరవాడ: మండలంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తానాం గ్రామంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు ప్రారంభించారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను కలిసి జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాల తీరు తెన్నులను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవడానికి ప్రజలు ముందుకు రావాలని జెడ్పీటీసీ రాజు పిలుపునిచ్చారు. ఇళ్లకు స్టిక్కర్లు అతికించారు. నాయుడుపాలెంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని పార్టీ నాయకుడు కూండ్రపు సీతారామయ్య, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు ఇంటింటికీ వెళ్లి జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.

- వాడచీపురుపల్లిలో వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు, గ్రామ కన్వీనరు కూండ్రపు తాతాజీ, తదితరులు ఇంటింటికీ వెళ్లి జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాల తీరు తెన్నులను అడిగి తెలుసుకున్నారు.
- గొర్లివానిపాలెంలో పార్టీ సీనియర్ నాయకుడు గొర్లి గోపి, గొర్లి ఎరుకునాయుడు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు.
- ముత్యాలమ్మపాలెంలో పార్టీ సీనియర్ నాయకులు బొంది అచ్చిబాబు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు.సీఎంగా మళ్లీ వైఎస్ జగన్‌నే గెలిపించాలని కోరారు.



గణేష్‌కాలనీలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్న దాసరి సత్తిబాబు



95వ వార్డులో వృద్ధురాలికి సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న కార్పొరేటర్ దేముడు



రాంపురంలో ప్రజలతో మాట్లాడుతున్న అన్నంరెడ్డి శ్రీరాములు



తానాంలో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్ అతికిస్తున్న జెడ్పీటీసీ రాజు

10, 11 తేదీల్లో పైడిమాంబ పండగ



పెదముషిడివాడలో వెలసిన పైడిమాంబ ముఖ చిత్రం

పరవాడ: మండలంలోని పెదముషిడివాడ గ్రామంలో కొలువుదీరిన పైడిమాంబ గ్రామ దేవత పండగను ఈ నెల 10, 11 తేదీల్లో వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశామని ఉత్సవ కమిటీ చైర్మన్ పల్లా అప్పారావు(కబడ్డీ) చెప్పారు. అమ్మవారి మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ తోరణాలు, పూలతో అలంకరించి ముస్తాబు చేస్తారు. మంగళవారం వేకువ జాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. ఆలయ ప్రాంగణంలో షామియానాలు, ఉచిత మజ్జిగ, మంచినీరు, ప్రసాదాన్ని అందించడానికి ఏర్పాట్లు చేశారు. తొలి రోజు సోమవారం తొలేళ్లు పురస్కరించుకొని పులి వేషాలు, తప్పెటగుళ్లు, సేవ గరిడీ, నేల వేషాలు, చిడతలు, మేదర బండి, పూసల డ్యాన్సులు, బళ్ల వేషాలు, డాన్స్ బేబీ డ్యాన్సు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అదే రోజు రాత్రికి బాలు రైడ్స్ డ్యాన్సు, రేలారే రేలా, బస్టర్స్ డ్యాన్సు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అమ్మవారి అనుపు మహోత్సవంలో భాగంగా మంగళవారం ఉదయం 10 గంటలకు జిల్లా స్థాయి గుర్రపు స్వారీ పోటీలు ఏర్పాటు చేశారు. విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నారు. రాత్రికి తోడుపెద్దు గరిడి, మేదరబండి, పులివేషాలు, తప్పెడుగుళ్లు, బళ్ల వేషాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు



పైడిమాంబ అమ్మవారిని దర్శించుకొనే భక్తులకు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. షామియానాలు, బారికేడ్లు, ఉచిత మంచి నీరు, మజ్జిగ, ప్రసాదం అందిస్తాం. రాత్రికి భారీ బాణ సంచాకాల్పుల నడుమ అమ్మవారి అనుపు మహోత్సవం వైభవంగా నిర్వహిస్తాం.

– పల్లా అప్పారావు, ఉత్సవ కమిటీ చైర్మన్, పెదముషిడివాడ

కరెంట్‌షాక్‌తో భవన నిర్మాణ కార్మికునికి తీవ్ర గాయాలు

అక్కిరెడ్డిపాలెం: నిర్మాణ పనులు చేస్తుండగా విద్యుత్ వైర్లు తగిలి భవన నిర్మాణ కార్మికుడు తీవ్ర గాయాలపాలైన ఘటన 69వ వార్డు చుక్కవానిపాలెంలో శుక్రవారం చోటు చేసుకుంది. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చుక్కవానిపాలెంలో ప్రధాన రోడ్డు పక్కన అనధికారిక షాపుల నిర్మాణం జరుగుతోంది. దీనిలో భాగంగా కాపుజగ్గరాజు పేటకు చెందిన గొంపా పైడిరాజు (54) నిర్మాణంలో ఉన్న ఒక శ్లాబ్ మీద సిమెంట్ చదును చేస్తున్నాడు. ఆ సమయంలో అతని చేతిలో ఉన్న ఐరన్ పనిముట్టు, సమీపంలోని కరెంట్ వైరుకు తగలడంతో పైడిరాజుకు విద్యుదాఘాతం తగిలి తీవ్ర గాయాలపాలయ్యాడు. దీనిని గమనించిన తోటి పనివారు షీలానగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. క్షతగాత్రుని కి భార్య, పెళ్లయిన ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడున్నాడని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు చెప్పారు.

పక్కాగా హద్దు రాళ్ల ఏర్పాటు

ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి రేవు ముత్యాలరాజు

సబ్బవరం: సమగ్ర రీసర్వే పూర్తయిన గ్రామాల్లో హద్దు రాళ్ల ఏర్పాటు ప్రక్రియ పక్కాగా చేపట్టాలని ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి రేవు ముత్యాలరాజు ఆదేశించారు. మండలంలోని అయ్యన్నపాలెంలో నిర్వహిస్తున్న సమగ్ర రీ సర్వేలో భాగంగా చేపడుతున్న హద్దు రాళ్లు పాతే కార్యక్రమాన్ని ఆయన కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టితో కలిసి శుక్రవారం పరిశీలించారు. సర్వే, రెవెన్యూ సిబ్బందిని రాళ్లు పాతే వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సరిహద్దు రాళ్లు పోరంబోకు భూముల్లో పాతుతున్నట్లు మండల సర్వేయర్ శ్రీనివాసరావు ఆయనకు వివరించారు. 368 రాళ్లు పాతే ప్రక్రియ నేటితో పూర్తయిందన్నారు. గ్రామంలోని రైతుల కమతాల మధ్య హద్దరాళ్లు నాటేందుకు అధికారులంతా సన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఇప్పటికే గ్రామంలో నాటేందుకు అవసరమైన 2,516 హద్దు రాళ్లను సిద్ధంగా ఉంచామని తెలియజేశారు. అదేవిధంగా విప్పాక అగ్రహారంలో రాళ్లు నాటే కార్యక్రమం ఇప్పటికే పూర్తయిందని అధికారులు వివరించారు. రాయపుర అగ్రహారం గ్రామంలో 574 సరిహద్దు రాళ్లకుగాను 165 రాళ్లు నాటామని ఈ సందర్భంగా ఆయనకు వివరించారు. ఆయన వెంట కలెక్టర్‌తో పాటు ఆర్డీవో చిన్నకృష్ణ, రెవెన్యూ,ఎస్ఆర్ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.



రాళ్లు నాటే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న సీఎం అదనపు కార్యదర్శి ముత్యాలరాజు, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

సింహాచలం: పెందుర్తి నియోజకవర్గం పరిధిలో పలు ప్రాంతాల్లో సంభవించిన వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెల్లివీధికి చెందిన లోవరాజు..

నగరంలోని ఏవీఎన్ కళాశాల సమీపంలోని రెల్లివీధికి చెందిన సూరాడ లోవరాజు(36) కొత్తవలస దరి గోల్డ్‌స్టార్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ద్విచక్ర వాహనంపై గురువారం రాత్రి నైట్ డ్యూటీకి వెళ్లాడు. శుక్రవారం విధులు ముగించుకుని వస్తుండగా సత్తరవు జంక్షన్ నుంచి అడవివరం రూట్లో మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఇంటికి వెళ్తున్నాడు. దువ్వపాలెం క్వారీ జంక్షన్ వద్ద శొంఠ్యాం వైపు వెళ్తున్న మినీ వ్యాన్ ఢీ కొట్టడంతో తీవ్రగాయలై అక్కడికక్కడే లోవరాజు మృతిచెందాడు. పెందుర్తి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా 108 సకాలంలో రాకపోవడంతోనే లోవరాజు మృతిచెందాడని పలువురు ఆరోపించారు.

రైలు పట్టాలపై ..

సింహాచలం: పెందుర్తి మండలం చింతలగ్రహారం సమీపంలోని రైలు పట్టాలపై వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. . రైలు పట్టాలపై మృతదేహం ఉన్నట్టు గుర్తించి స్థానికులు శుక్రవారం పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు మృతుడి జేబులో ఉన్న కాగితంపై ఫోన్ నెంబరు ఆధారంగా నగరంలోని మహారాణిపేటకు చెందిన మహ్మద్ ఇస్మాయిల్((55)గా గుర్తించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ప్రమాదావశాత్తు రైలు నుంచి పడిపోయాడో లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అన్న కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. జీఆర్‌పీ ఎస్ఐ బాలాజీరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరవాడ: అనకాపల్లి–గాజువాక జాతీయ రహదారిలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో శానపతి నరేష్(34) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు నరేష్‌కోటవురట్ల గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. వివరాలిలా ఉన్నాయి. కోటవురట్లకు చెందిన నరేష్ ఫార్మాసిటీలో రెక్స్ ఫార్మా పరిశ్రమలో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి 10 గంటల సమయంలో సాలాపువానిపాలెం నుంచి తన స్నేహితుడి ద్విచక్ర వాహనంపై పనిచేస్తున్న పరిశ్రమలో విధులకు వస్తున్న క్రమంలో సాలాపువానిపాలెం మలుపు వద్దకు రాగానే వెనుక నుంచి వచ్చిన మరో ద్విచక్ర వాహనం నరేష్ ప్రయాణిస్తున్న వాహనాన్ని బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నరేష్ తలకు తీవ్రంగా గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. అనకాపల్లి వంద పడకల ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని శుక్రవారం బంధువులకు అప్పగించారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



క్రీస్తు సందేశాన్ని వివరిస్తున్న ఫాదర్ కల్యాణ్



ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవ సోదరులు

సబ్బవరం: మండలంలోని పలు క్రైస్తవ ఆరాధన మందిరాల్లో గుడ్‌ఫ్రైడేను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సబ్బవరం క్యాథలిక్ చర్చిలో శిలువ మార్గం పేరుతో సినాయి కొండపై శిలువ వేసే ముందు ప్రభువును 14 స్థలాల్లో హింస పెట్టిన సన్నివేశాలను ప్రదర్శించారు. డాన్ బోస్కో నవజీవన్ సంస్థ ఫాదర్ కల్యాణ్ ప్రార్థనలు నిర్వహించారు. ఏసు ప్రభువు శిలువలో పడిన పాట్లను, ఆయన శ్రమ వల్ల భక్తులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రార్థనల్లో సబ్బవరం కేథలిక్ చర్చి ప్రీస్ట్ ఫాదర్ తోమస్ పులికల్, బ్రిజితన్ కాన్వెంట్ సిస్టర్స్ పునీత,సోహల్,పుష్ప,ఫ్లోరా, మదర్ అలీస్,జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గుడే ఫ్రైడే

సింహాచలం: గుడే ఫ్రైడే పురస్కరించుకుని పెందుర్తి ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ నుంచి జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్ విజయ్, కౌన్సిల్ మెంబర్ పునీత, ప్రశాంతి అవిలాపురి, తేరేజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు కర్మాగార పరిరక్షణ అందరి బాధ్యత



దీక్ష శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: వేలాది మంది కార్మికులకు ప్రత్యక్షంగా, లక్షల మంది ప్రజలకు పరోక్షంగా జీవనోపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 785వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగ కార్మికులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని మన రాష్ట్ర పార్లమెంట్ సభ్యులందరూ కలిసి పార్లమెంట్‌లో గళమెత్తాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను సమైక్యంగా ఎదుర్కొవడం కోసం కార్మిక వర్గాన్ని సమాయత్తం చేయాలన్నారు. కార్యక్రమంలో ఇతర కార్మికులు పాల్గొన్నారు.

నూతన ఏజీఎంకు అభినందనలు



ఏజీఎం రాజుకు అభినందనలు తెలుపుతున్న ఉరుకూటి బాబూరావు

అక్కిరెడ్డిపాలెం: భెల్ విశాఖపట్నం యూనిట్ కొత్త ఏజీఎం (హెచ్ఆర్) ఎం.వి.ఎస్.ఎస్.రాజుకు యూనియన్ ప్రతినిధులు శుక్రవారం అభినందనలు తెలిపారు. గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి బాబూరావు, సిటూ ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్, ఆయా యూనియన్ల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్ఆర్ కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.